పాత నేరస్తులపై పోలీస్ నిఘా

- రౌడీషీటర్లు, పాతనేరస్తులు తహసీల్దార్ ఎదుట బైండోవర్
- గ్రామాల బెల్టుషాపులు మూసివేత



నేరడిగొండ పోలీస్‌స్టేషన్

నేరడిగొండ: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాత నేరస్తులపై పోలీసులు ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశారు. వివిధ నేరాల్లో కేసులు నమోదైన పాత నేరస్తులు, నాటుసారా విక్రయదారులు బెల్టుషాపు నిర్వాహకులు, రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై దృష్టిసారించారు. సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. గ్రామాల్లో, మండల కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

ముందు జాగ్రత్తలు..

ముందస్తు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లు, సర్కిల్, డివిజన్, జిల్లా కార్యాలయాల వారీగా పలువురిని పిలిపించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారు. మద్యం తాగి ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించేవారిని రాజకీయ కక్షసాధింపు, అల్లర్లు చేసేవారిని బైండోవర్ చేస్తున్నారు. పాత నేరస్తులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ప్రతీవారం పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

పల్లెలు ప్రశాంతం

జిల్లాలోని ప్రతీ మారుమూల గ్రామంలో ఉన్న బెల్టుషాపులు మూసివేయడంతో పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా మద్యం, సారా విక్రయాలు లేకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచారు. గ్రామాల్లో మందు లేకపోవడంతో మద్యం ప్రియులు పొద్దుగాకముందే ఇంటికి చేరుతున్నారు. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1376 మంది బైండోవర్

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని పోలీసుస్టేషన్లలో 850 మందిపై కేసులు నమోదు చేశారు. 1376 మంది పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అయితే ఇలా ముందస్తుగా కట్టుదిట్టం చేయడంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

బైండోవర్ చేస్తున్నాం



ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పాత నేరస్తులను ముందుగా బైండోవర్ చేస్తున్నాం. ప్రజలు తమ ఓటును వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాం. పాత నేరస్తులు, బెల్టుషాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడైన మద్యం విక్రయాలు జరిపితే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలి.

– సాయన్న, ఎస్సై, నేరడిగొండ

క్లుప్తంగా

కాంగ్రెస్‌దే అధికారం



మాట్లాడుతున్న ముడుపు ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: రాష్ట్రంలో కమ్యూనిస్టుల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి జోస్యం చెప్పారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేలు తమకు అనుకూలంగా ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలు, చేసిన అవినీతిని ప్రజలు గమనించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మందకృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జైనథ్: ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రాన్ని ఒప్పించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణకు ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ కుల సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలపారు. మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో మందకృష్ణ ఫ్లెక్సీకి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలను ఓడించాలి

ఇచ్చోడ: మాదిగ దాని ఉపకులాలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణపై కాంగ్రెస్, పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మోసం చేశాయన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బరుకుంట సుభాష్, జిల్లా కార్యదర్శులు కొత్తపల్లి రాజేశ్వర్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పసుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలి

ఇచ్చోడ: మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిపై ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని మండల అధ్యక్షుడు రాజేశ్వర్ ఓ ప్రకటనలో కోరారు. ఎస్సీ కులాలను రెండుగా విభజించడానికి ప్రయత్నిస్తున్న ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న ఖండించారని తెలిపారు. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని వైజాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మడావి గోపాల్ తండ్రి నాగోరావ్ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గోడం నగేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు షేక్ జమీల్, అల్లూరి సుధాకర్‌రెడ్డి, సోయం సతీశ్, కుడ్మెత జంగు, బేర దేవన్న, సర్పె సోంబాయి ఉన్నారు.

వైభవంగా సప్తాహం ముగింపు



పల్లకీ ఊరేగిస్తున్న భక్తులు

బేల: మండలకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా ఆలయప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగుతున్న బాబా సప్తాహం ముగింపు వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక హనుమన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర ర్యాలీ చేపట్టారు. పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. తర్వాత బాజీరావు బాబా ప్రధాన శిష్య బృందం ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణం చేపట్టారు. దీంతోపాటు భజన, కీర్తనలను ఆధ్యాత్మిక సంబోధనతో కొనసాగించారు. చివరగా కాలదహీ హండిని చేపట్టి, తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. అన్నదానం నిర్వహించారు.

కోరం లేక సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ

నేరడిగొండ: ఎంపీడీవో సమావేశమందిరంలో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ప్రకటించారు. వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, చిన్నబుగ్గారం ఇన్‌చార్జి సర్పంచ్ విలాస్, ఎంఈవో భూమారెడ్డి, ఏఈవో జైపాల్, పశువైద్య శాఖ అధికారి, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు హాజరయ్యారు. తక్కువ సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశం తిరిగి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో శోభన తెలిపారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయ

ఇచ్చోడ: మహిళా సాధికారతపై ప్రతీ విద్యార్థి అవగాహన ఉండాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మహిళా సాధికారతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీడీవో మాట్లాడుతూ ఉత్తమ సమాజం కోసం బాలలే పునాదులు అవుతారని తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాలల హక్కులకు భంగం కల్గితే 1098 కాల్ చేయాలన్నారు. కాత్లె ఉత్తందాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న ముధోల్ సీఐ వినోద్

తానూరు: ప్రజల భద్రత కోసమే పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్వి గ్రామంలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 50 మంది పోలీస్ సిబ్బంది ఇళ్ల ముందు నిలిపిన వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కిరాణదుకాణాల్లో తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని ఆరు ఆటోలు, నాలుగు ఫోర్ వీలర్లు, 86 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

భగీరథ చెరువులోకి మిల్లు వ్యర్థాలు

- సుమారు ఐదు క్వింటాళ్ల చేపలు మృతి
- అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారుల ఆవేదన

లోకేశ్వరం: మండల కేంద్రంలోని భగీరథ చెరువులో ఐదు క్వింటాళ్ల చేపలు మృతి చెందడంతో రూ.యాభై వేల వరకు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు తెలిపారు. మండలంలోని సేవాలాల్‌తండా ప్రాంతంలోని బాయిల్డ్ రైస్‌మిల్లు నుంచి వ్యర్థాలను ఒక్కసారిగా లోకేశ్వరం భగీరథ చెరువులోకి వదలడంతో నీరు కలుషితమై చేపలు మృతి చెందాయని మత్స్యకారులు పేర్కొన్నారు. మిల్లు నుంచి వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాలకు చెందిన పశువులు కూడా ఈ చెరువు నీళ్లు తాగుతాయని.. వాటికి కూడా ప్రమాదం పొంచి ఉందని మత్స్యకారులు పేర్కొన్నారు.

అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ పరిశీలన



కౌన్సిలింగ్ ఇస్తున్న డాక్టర్ శిరీష

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామంలోని పీహెచ్‌సీని మంగళవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజర్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో కుష్టు వ్యాధి కేసులు ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణతేజ, డీపీఎంవోలు శివకుమార్, రాఘవయ్య, హెచ్ఈవో జగదీశ్, సబ్ యూనిట్ అధికారి పుట్ట సత్తయ్య, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చేసిన పార్టీని ఆదరించాలి

- బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న
- పట్టణంలో ఎన్నికల ప్రచారం



అభివాదం చేస్తున్న జోగు రామన్న



ప్రచారం చేస్తున్న జోగు రామన్న

కైలాస్‌నగర్: అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో ఆదరించి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఆదిలాబాద్‌లోని వ్యాపార సముదాయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన చౌక్‌ల్లోని దుకాణాల్లోకి వెళ్లి బీఆర్ఎస్ మేనిఫెస్టోతో కూడిన కరపత్రాలు అందజేస్తూ, వాటి ప్రయోజనాలను ఓటర్లకు వివరించారు. పట్టణాభివృద్ధికి చేపట్టిన చర్యలను వారికి వివరించారు. స్థానిక డైట్ మైదానం నుంచి ప్రారంభమైన ఈ ప్రచారం నేతాజీ చౌక్, అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్‌ల మీదుగా సాగింది. భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకాగా, పట్టణ వీధులు గులాబీమయంగా మారాయి. దుకాణాదారులు ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలుకగా, వారిని ఆప్యాయంగా పలకరించారు.

ఓటమి భయంతోనే బురదజల్లే ప్రయత్నాలు

ఆదిలాబాద్‌రూరల్: ఓటమి భయంతోనే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేశారని బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న అన్నారు. ప్రచారంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు పొందిన ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఎన్నికల వేళ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ పార్టీలకు ప్రజా క్షేత్రంలో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ఆయనకు గ్రామస్తులు డప్పు చప్పుళ్ల నడుమ స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. కాగా ప్రమోద్ ఖానుకర్ ఆధ్వర్యంలో మంగ్లీ, ఖీంసరి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ గండ్రత్ రమేశ్, మంచికట్ల ఆశమ్మ, వేణుగోపాల్ యాదవ్, బి.రమేశ్, జి.రమేశ్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, సాయిని రవి పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలపై మాట్లాడడం హాస్యాస్పదం

కైలాస్‌నగర్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ జిల్లా కేంద్రంలో వారసత్వ రాజకీయాల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుమారుడు సర్పంచ్‌గా ఎన్నికైన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భూమన్న, వి.నారాయణ, రంగినేని శ్రీనివాస్, అజయ్, కలీం, మర్రి విజయ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఓడించండి

- బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్



దుబార్‌పేట్‌లో మాట్లాడుతున్న సోయం

ఇచ్చోడ: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు ఓడించాలని బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని దుబార్‌పేట్, సిరిచెల్మ,నేరడిగొండ(జి), నారాయణపూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం వేలకోట్లు దోచుకుందని ఆరోపించారు. సుస్థిరపాలన కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాదవ్ అమ్టె, మండల కన్వీనర్ కేంద్రే నారాయణ, నాయకులు బాలాజీ, అశోక్ పాల్గొన్నారు.

తాంసి: బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ మద్దతుగా భీంపూర్ మండలంలోని కరంజి(టి), కరన్‌వాడీ, ఇంద్రనగర్ గ్రామాల్లో బీజేపీ నేతలు ప్రచారం నిర్వహించారు. గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్, పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్‌యాదవ్, జిల్లా నాయకుడు దేవారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు నర్సింగ్, నారాయణ, రెడ్డి రమేశ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: రైతును రాజు చేయడమే బీజేపీ లక్ష్యమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణ్ కేంద్రే, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. మండలంలోని మన్నూర్, మన్నూర్ సాయినగర్‌లో మంగళవారం నిర్వహించిన ప్రచారం చేశారు. ఎంపీపీ భరత్, మండల అధ్యక్షుడు సుభాష్ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లో మంగళవారం నిర్వహించిన వడ్గాం రాయిసెంటర్ సమావేశానికి బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు ఐక్యంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలు కమలం పువ్వు గుర్తుకు ఓటేస్తామని, సోయంను గెలిపిస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామపటేళ్లు మనోహర్, సంభుతోపాటు వెంకటేశ్, దాదారావు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కుచులాపూర్, బిర్లాగొంది గ్రామాల్లో మంగళవారం బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ సుభాష్ సూర్య, ప్రధాన కార్యదర్శులు లాడేవార్ తుకారాం, కృష్ణ, వైస్ ఎంపీపీ లింబాజీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓట్లు చీల్చేందుకు కుట్రలు

- కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి



సాంగ్వి(జి)లో ఎడ్లబండిపై కంది ప్రచారం

బేల: కాంగ్రెస్ ఓట్లు చీల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ప్రజలందరూ దీన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సైద్‌పూర్, పాఠగూడ, సాంగ్వి(జి), సాంగ్వి(కె), తదితర గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై ప్రజలకు వివరించారు. మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, నాయకులు సామ రూపేష్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, వాంఖడే వామన్, గావుండే ఘణేశ్యాం, గోడే అవినాష్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని దుర్గానగర్, పిట్టల్‌వాడ, శంకర్‌గుట్ట కాలనీల్లో కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది సాయిమౌనారెడ్డి మంగళవారం ప్రచారం పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆరు గ్యారంటీ హామీల కరపత్రాలను అందజేశారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నళినిరెడ్డి, లత, స్వప్న, నీలిమ, సుస్మిత, శరణ్యారెడ్డి, అఖిల్‌రెడ్డి, అమీనా, విష్ణు, నాని, బస్వంతే విష్ణు, వసంత్ పవార్, రాకేశ్‌రెడ్డి, మహమ్మద్ వదూద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్



జల్దాలో మాట్లాడుతున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ/తలమడుగు/నేరడిగొండ/బోథ్/గుడిహత్నూర్/తాంసి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని జల్దా గ్రామంలో మంగళవారం ఆయన సమక్షంలో పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలు తనను గెలిపించాలని కోరారు. గాడ్గే సుభాష్, వెంకటేశ్, పాల్గొన్నారు. తలమడుగు మండలం చెర్లపల్లి, టోక్కిగూడ, షేర్‌గూడ, రత్నాపూర్‌లో జరిగిన ప్రచారంలో అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు. తాంసితోపాటు గిరిగాం, అంబుగాం, లీమ్‌గూడలో మాజీ గోడం నగేశ్, నేరడిగొండ మండలం దర్బ, దర్బతండా, వాగ్దారిలో మండల కన్వీనర్ శివారెడ్డి, బోథ్ మండలం చింతల్‌బోరి, పార్ది (కె), పుణ్యానాయక్ తండాల్లో ఎంపీపీ శ్రీనివాస్, సాయినగర్‌కాలనీలో జెడ్పీటీసీ సంధ్యారాణి ప్రచారం చేశారు. గుడిహత్నూర్ మండలం డొంగర్‌గావ్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, నాయకుడు తాహేర్‌ఖాన్ పాల్గొన్నారు.

జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా సినీనటుల ప్రచారం



జన్నారం: ప్రచారంలో పాల్గొన్న సినీతారలు

జన్నారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీతారలు జన్నారం మండలానికి వచ్చి సందడి చేశారు. జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ తరుపున యజ్ఞం సినిమా విలన్ విజయ గంగరాజు, రియల్‌స్టార్ హీరో అప్సర్ అజాద్, నిర్మాత రాజశేఖర్, ఎన్నారై బాలరాజుగౌడ్‌లు ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ టీపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా జాన్సన్‌నాయక్ వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని పొనకల్, కిష్టాపూర్, కలమడుగు గ్రామాల్లో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో మండలంలోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో జెడ్పి చైర్మన్ జనార్దన్ రాథోడ్, నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువకులు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్రాభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చారులత రాథోడ్, ధరణి రాజేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్: యాదవుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని.. ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని యాదవ సంఘ భవనంలో కులస్తులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం యాదవులు విఠల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

దస్తురాబాద్/ఖానాపూర్: జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని గోసంపల్లె, రాంపూర్, రేవోజీపేట, మున్యాల, గోడిసిర్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీమద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీ య వార్షికోత్సవం మంగళవారం ప్రారంభమైంది. పండితులు ప్రసాద్‌శాస్త్రి, హరీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞశాల ప్రవేశం, గణపతిపూజ, కుంకుమార్చనలు చేపట్టారు.

నేడు మండల సమావేశం

ఇంద్రవెల్లి: ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఓ ప్రకటనలో తెలిపారు. శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

దేశం, ధర్మం కోసం పోరాడాలి



ప్రచారం చేస్తున్న హిందూ వాహిని సభ్యులు

కుంటాల: దేశంలోని ప్రతీ పౌరుడు దేశం, ధర్మం కోసం పనిచేయాలని హిందూవాహిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో దేశ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఓటు వేయాలని ఇంటింటా మంగళవారం ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ధర్మం తప్పకుండా నిజాయతీగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, హిందూవాహిని మండల కన్వీనర్ సిందె దిగంబర్‌పటేల్, సభ్యులు సాయి, అజయ్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.